క్లుప్తంగా

ఈనెల 28న మండల సమావేశం


చేజర్ల(సోమశిల): ఈ నెల 28న అనంతసాగరం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వ సభ్య సమావేశం జరుగునని ఎంపీడీఓ మధుసూదన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరుకావాలని ఆయన కోరారు.

రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శిగా పసుపులేటి


పసుపులేటి శంకర్

వింజమూరు (ఉదయగిరి): ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా వింజమూరుకు చెందిన పసుపులేటి శంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండ్రోజుల క్రితం కర్నూల్‌లో జరిగిన బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర సదస్సులో రాష్ట్ర అధ్యక్షుడు జే శ్రీకాంత్ ప్రకటించారు. శంకర్ ప్రస్తుతం వింజమూరులో పురోహితుడిగా ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన మీద నమ్మకంతో నాకు ఈ బాధ్యత అప్పగించిన రాష్ట్ర నాయకత్వం ఆదేశాల ప్రకారం బ్రాహ్మణ జాతి అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

నేడు పెంచలస్వామి 33వ ఆరాధన



ఆత్మకూరురూరల్: మండలంలోని సోమశిల-ఆత్మకూరు మార్గంలో మహిమలూరు రోడ్డు కూడలి దేపూరు వద్ద ఉన్న శ్రీహనుమాన్ భక్త పెంచలస్వామి 33వ ఆరాధన గురువారం నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకులు నాయుడు భాస్కర్‌నాయుడు, నాయుడు పెంచల నాయుడు బుధవారం తెలిపారు. తెల్లవారుజాము నుంచి సుప్రభాత సేవతో ఆరాధనోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. పెంచలస్వామి సమాధి వద్ద అభిషేకాలు, ఆంజనేయ స్వామి అష్టోత్తర పూజలు నిర్వహిస్తామన్నారు.

ఆగస్టు 1 నుంచి సీబీఏ పరీక్షలు

ఉదయగిరి: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఆగస్టు 1వ తేదీ నుంచి విద్యార్థులకు సీబీఏ (క్లాస్ బేస్డ్ అసిస్టెంట్) పరీక్షలు జరుగుతాయని ఎంఈఓ-2 తోట శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు రూపొందించిన ప్రశ్నపత్రాలను ఆయా స్కూల్ కాంప్లెక్స్‌లకు చేరుస్తామని చెప్పారు. ఆయా కాంప్లెక్స్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు పరీక్షలు జరిగే గంట ముందు తీసుకెళ్లాల్సి ఉంటుందన్నారు. పగడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు ప్రధానోపాధ్యాయులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

వీడని ముసురు

ఉదయగిరి: బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం ప్రభావంతో గత రెండ్రోజుల నుంచి ఉదయగిరి నియోజకవర్గంలో ముసురు పట్టింది. చిరుజల్లులు మాత్రమే పడుతున్నాయి. దీంతో వాగులు, వంకలకు నీరు చేరే పరిస్థితి కనిపించడం లేదు కానీ జనజీవనానికి ఇబ్బందిగా మారింది. మోస్తరు వర్షం పడితేగాని చెరువులు, కుంటలకు నీరు చేరే అవకాశముంది. ముసురుతో ఉద్యాన పంటలకు మేలు చేకూరింది.

విద్యార్థులకు నగదు బహుమతి



సంగం: మండలంలోని గాంధీజనసంఘం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2022-23 విద్యాసంవత్సరంలో 10వ తరగతి అత్యధిక మార్కులు సాధించిన మొదటి ముగ్గురు విద్యార్థులకు పాఠశాల గణిత ఉపాధ్యాయుడు యాకసిరి పెంచలయ్య తన తల్లి శేషమ్మ జ్ఞాపకార్థం నగదు బహుమతిని అందజేశారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అత్యధిక మార్కులు సాధించిన కె.సాజన్య, అబ్దుల్ రషీద్, పెంచలగీతేశ్‌కు రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు వంతున నగదు బహుమతిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల చేతుల మీదుగా అందచేశారు. హిందీలో 97 మార్కులు సాధించిన రషీద్‌కు హిందీ ఉపాధ్యాయులు మధు రూ.5 వేలు అందజేసి అభినందనలు తెలిపారు.

శ్రీపంచముఖ శక్తి గణపతికి విశేష పూజలు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మండలంలోని డీసీపల్లిలో కొలువై ఉన్న శ్రీ పంచముఖ శక్తి గణపతి స్వామికి బుధవారం భక్తులు అధిక సంఖ్యలో విశేష పుష్పాలు, గరిక తోరణాలు, గజమాలతో పూజలు నిర్వహించారు. రేవూరు నారాయణరెడ్డి, పద్మావతి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి పాశర్లపూడి వెంకటేశ్వర్లుశర్మ పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

అభివృద్ధి సంతకం

వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలన అభివృద్ధి, సంక్షేమానికి సరికొత్త నిర్వచనం. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, పాల సేకరణ కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీల భవనాలు, సరికొత్త హంగులతో పల్లెలు కళకళలాడుతున్నాయి. మరో వైపు జగనన్న కాలనీలు పల్లెల రూపురేఖలు మారిపోతున్నాయి. సకాలంలో వర్షాలు కురుస్తుండడంతో పచ్చని పంటలు, పాడితో సుభిక్షంగా ఉన్నాయి. ఓ వైపు వ్యవసాయ పనులు, ఇంకో వైపు ఉపాధి పనులతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడ్డాయి.

- వెల్లివిరుస్తున్న సంక్షేమం
- కొత్త భవనాలతో కళకళ
- రూపురేఖలు మారుతున్న పల్లె స్వరూపం

గ్రామాల్లో అందుబాటులోకి వచ్చిన డీసీపల్లిలో గ్రామ సచివాలయం



ఆత్మకూరు: దేశానికి పట్టుకొమ్మలు పల్లెలు. పల్లెలు ప్రగతి సాధిస్తే దేశం అభివృద్ధి సాధించినట్లేనని జాతిపిత మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారు. గ్రామాల్లో నాలుగు సిమెంట్ రోడ్లు, అరకొర మందికి సంక్షేమ పథకాలు అందిస్తూ ఇదే అభివృద్ధి, సంక్షేమం అంటూ టీడీపీ రాష్ట్రాన్ని అడ్డంగా దోచుకుంది. దశాబ్దన్నర కాలం రాష్ట్ర ప్రజల ఆర్థికస్వావలంబనకు తెలుగుదేశం అడ్డంకిగా మారింది. అయితే అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధికి, సంక్షేమానికి కొత్త నిర్వచనం సూచించారు. రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభం వెంటాడుతున్నా.. ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేస్తున్నా.. సంక్షేమ పథకాలను అప్రతిహతంగా కొనసాగిస్తున్నారు. అభివృద్ధి పనులు నిర్విరామంగా సాగిస్తున్నారు. ప్రతి పల్లెలో కోట్లాది రూపాయలతో నిర్మిస్తున్న ప్రభుత్వ వ్యవస్థల భవనాలతో పల్లెలు ప్రగతి పథంలో పరిఢవిల్లుతున్నాయి. ఏ గ్రామంలో చూసినా ప్రభుత్వ నూతన భవనాలు వివిధ దశల్లో కొన్ని పూర్తవ్వగా, మరికొన్ని నిర్మాణాలు పూర్తి చేసుకుంటున్నాయి. గ్రామాలకే ప్రభుత్వ పాలన అందివచ్చేలా సచివాలయ వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ పనుల కోసం గతంలోలా ఇక్కట్లు పడకుండా వ్యయప్రయాసలు తగ్గి సులువుగా పనులు అవుతున్నాయి. సచివాలయ వ్యవస్థలో వలంటీర్లను ప్రవేశపెట్టడంతో పల్లె ప్రజలకు ప్రభుత్వ పరమైన సమస్యలు తీర్చుకునేందుకు సులభమైంది. సచివాలయాల్లో వివిధ శాఖల ఉద్యోగులు అందుబాటులో ఉంటూ 500కిపైగా సేవలు ప్రజలకు అందుతున్నాయి.


డీసీపల్లిలో రైతు భరోసా కేంద్రం

పల్లె చెంతనే సేవలు

ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ విలేజ్ క్లినిక్‌లను ప్రారంభించడం, వారానికోమారు డాక్టర్లు ఇళ్ల వద్దకే వచ్చి పరీక్షలు నిర్వహించడం, ఉచితంగా మందులు అందజేస్తుండడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైతులకు ఆర్‌బీకేల్లో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు సైతం ఆర్‌బీకేల్లోనే సిబ్బంది అందుబాటులో ఉండడంతో రైతులకు గతంలో పడిన కష్టాలు తీరేలా చేస్తోంది. గ్రామ శివార్లలో చెత్త నుంచి సంపదను సృష్టించే కేంద్రాలను ఏర్పాటు చేయడంతో సేంద్రియ ఎరువులు అందుబాటులోకి వస్తున్నాయి.

భవనం	నిర్మాణ విలువ
సచివాలయం	రూ.35 లక్షలు
విలేజ్ హెల్త్ క్లినిక్	రూ.17.50 లక్షలు
పాల సేకరణ కేంద్రం	రూ.17.50 లక్షలు
ఆర్‌బీకే	రూ.21.80 లక్షలు
డిజిటల్ లైబ్రరీ	రూ.16 లక్షలు

రైతులకు పంటతో పాటు పాడి అభివృద్ధి చేసేలా పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తుండడంతో మంచి గిట్టుబాటు ధర లభించి రైతులకు పాడి పరిశ్రమల ద్వారా అదనపు ఆదాయం లభిస్తుంది. గ్రామాల్లోనే గోదాముల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తుండడంతో వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించేంత వరకు దాచుకొనేందుకు వీలుగా గోదాముల సౌకర్యం ఏర్పడనుంది. వీటికితోడు గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రధానమంత్రి గ్రామసడక్ యోజనలో రూ.58.62 కోట్లు నిధులు మంజూరుకావడం మంచి పరిణామం.

కనిపిస్తున్న మార్పు

గ్రామాల్లో విప్లవాత్మక మార్పు కనిపిస్తోంది. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 133 పంచాయతీలు ఉన్నాయి. 81 సచివాలయాలు ఏర్పడ్డాయి. వీటికి అనుబంధంగా రైతు భరోసా కేంద్రాలు, పాల సేకరణ కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీలు తదితర వాటిని ఏర్పాటు చేయడంతో మొత్తం గ్రామాల్లో 410 భవనాలు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే పలు భవనాలు ప్రారంభమై సేవలు అందిస్తుండగా, మరికొన్ని భవనాలు చివరి దశలో ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో మాత్రమే విలేజ్ క్లినిక్‌లు, పాలసేకరణ కేంద్రాలు పునాది దశలో ఉన్నాయి.


90 శాతం పూర్తి చేసుకున్న మాముడూరు సచివాలయ భవనం

పల్లెలకే ప్రభుత్వం వచ్చింది



గత ప్రభుత్వాల పాలనకు భిన్నంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాలకే సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వాలను తీసుకొచ్చారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, అడంగళ్ పత్రాలతో సహా త్వరలో రిజిస్ట్రేషన్లు సైతం సచివాలయాల్లో జరగనుండడం శుభపరిణామం. ప్రజలకు అందుబాటులో ప్రభుత్వం ఉండడంతో అందరు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– బాలిరెడ్డి సుధాకర్ రెడ్డి, మాముడూరు

నాడు-నేడుతో విద్యకు పెద్దపీట

ఇదిలా ఉండగా విద్యకు పెద్ద పీట వేస్తూ నాడు-నేడు పథకంలో భాగంగా కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేసి గ్రామాల్లో అనేక ప్రభుత్వ పాఠశాలల పాత భవనాలను తొలగించి నూతన భవనాలు ఏర్పాటు చేయడం, అదనపు తరగతి గదులు నిర్మించడంతో నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాల్లో అందుబాటులోకి వచ్చింది.

ఆత్మకూరు డిపోకు 4 ఇంద్ర బస్సులు

ఆత్మకూరురూరల్: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆత్మకూరు డిపోకు 4 ఇంద్ర బస్సులు మంజూరు చేసింది. ఇటీవల ఆత్మకూరులో ఎంజీఆర్ బస్‌స్టేషన్ ప్రారంభోత్సవం సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌కు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కొత్త బస్సులు కేటాయించాలని కోరారు. ఆత్మకూరు మున్సిపల్ బస్టాండ్‌లో శుక్రవారం సాయంత్రం నుంచి హైదరాబాద్, బెంగళూరు వైపు రాకపోకలు సాగించేలా ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి బస్సులను ప్రారంభిస్తారని మేకపాటి కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆత్మకూరు నుంచి వింజమూరు, దుత్తలూరు, వరికుంటపాడు, పామూరు, కనిగిరి, మార్కాపురం, మాచర్ల, హిల్‌కాలనీ, మల్లెపల్లి, ఎంజీబీఎస్ మీదుగా బీహెచ్‌ఈఎల్ వరకు రాకపోకలు సాగించే బస్సు ప్రతి రోజు సాయంత్రం 8 గంటలకు ఆత్మకూరులో బయలుదేరుతుందన్నారు. ఆత్మకూరు నుంచి బెంగళూరుకు వెళ్లే బస్సు రాత్రి 9 గంటలకు ఆత్మకూరు నుంచి బయలుదేరి డీసీపల్లి, మర్రిపాడు, బద్వేల్, కడప మీదుగా తెల్లవారుజామున 5.30 గంటలకు బెంగళూరుకు చేరుకుంటుందన్నారు. ప్రయాణికులు, ఆత్మకూరు ప్రాంత ప్రజలు ఈ ఆధునిక ఇంద్ర బస్సులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి



ఉదయగిరి: జిల్లా సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (యానాదులు) నుంచి రుణాలు తీసుకుని సక్రమంగా చెల్లించని బకాయిదారులు వెంటనే చెల్లించాలని ఆ సంస్థ డీడీ శ్రీనివాసులు తెలిపారు. ఆయన బుధవారం ఉదయగిరి మండలంలో రుణాలు తీసుకుని నెలవారీ కంతులు సక్రమంగా చెల్లించని వారికి నోటీసులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ 2017లో ఎన్‌ఎస్‌పీఎఫ్‌డీసీ పథకం కింద జిల్లాలో 72 మంది సబ్సిడీ రుణాలు తీసుకున్నారని, వారిలో 40 మంది సక్రమంగా చెల్లిస్తున్నారని, 32 మంది సక్రమంగా చెల్లించకపోవడంతో నోటీసులు ఇచ్చామని చెప్పారు. బకాయిలు చెల్లించాల్సిన వారు వెంటనే చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం


అనంతసాగరంలో మినీ స్టేడియం భూమి కేటాయింపు పత్రాలను ప్రజాప్రతినిధులకు అందజేస్తున్న ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): గ్రామీణ క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో ప్రోత్సాహం అందిస్తుందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు.మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో తన నివాసంలో బుధవారం అనంతసారంలో మినీ స్టేడియం ఏర్పాటుకు సర్వే నంబరు 467లో 6.17 ఎకరాల భూమిని అధికారికంగా కేటాయిస్తూ సంబంధిత పత్రాలను ఎమ్మెల్యే ప్రజాప్రతినిధులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల కలెక్టర్ హరినారాయణన్‌ను కలిసి అనంతసాగరంలో మినీ స్టేడియం ఏర్పాటుకు భూమి కేటాయించాలని కోరగా, సత్వరం స్పందించి చర్యలు తీసుకున్నారని, కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ వారికి ఈ భూమిని అప్పగించి క్రీడాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంత క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేలా పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. త్వరలోనే మినీ స్టేడియం నిర్మాణ పనులు చేపట్టి క్రీడాకారులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ కాలువ నరసింహులు, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, బాక్సింగ్ కోచ్ విశ్వనాథ్, తహసీల్దారు టి.ప్రదీప్, అనంతసాగరం ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, జేసీఎస్ కన్వీనర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, వైస్ ఎంపీపీ అల్లంపాటి సుధాకర్‌రెడ్డి, బసిరెడ్డి జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసు వేళలు మార్పు చేయండి

- డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన

కావలి: కావలి ఆర్టీసీ డిపోలో బుధవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభించింది. పలు ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలను డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులకు తెలియజేశారు. కావలికి చెందిన విజయ్ అనే ప్రయాణికుడు కావలి నుంచి హైదరాబాద్‌కు బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని కోరగా ఆత్మకూరు డిపోకు చెందిన బస్సు కావలి మీదుగా హైదరాబాద్‌కు వెళ్లేలా ఏర్పాటు చేశామని డీఎం తెలియజేశారు. కప్పరాళ్లతిప్ప కూడలి వద్ద బస్సుల రాకపోకల వివరాలు తెలియజేసేలా టైమింగ్ బోర్డును ఏర్పాటు చేయాలని రవిచంద్ర అనే ప్రయాణికుడు కోరగా త్వరలోనే బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గుడ్లదొనకు ఉదయం ఆరు గంటల తర్వాత తిరిగి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మళ్లీ బస్సు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని హరి అనే ప్రయాణికుడు డీఎం దృష్టికి తీసుకురాగా గురువారం నుంచి ఉదయం 11.15 గంటలకు గుడ్లదొనకు బస్సు సర్వీసు అందుబాటులోకి తీసుకురానున్నట్లు డీఎం తెలిపారు. లింగసముద్రం గ్రామానికి ఉదయం 9 గంటలకు ఉన్న బస్సు సర్వీస్‌ను 9.15 గంటలకు మార్చాలని ఉపాధ్యాయులు, ఉద్యోగస్తుల తరఫున రఘునాథ్ అనే ప్రయాణికుడు విజ్ఞప్తి చేయగా డీఎం అంగీకరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) కేవీఆర్ బాబు, డిప్యూటీ సూపరింటెండెంట్ (టాఫిక్) రమేష్ బాబు, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం కల్పిస్తే చర్యలు తప్పవు

- డీఎస్పీ కోటారెడ్డి

అనుమసముద్రంపేట: దర్గాకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కల్పించినా చర్యలు తప్పవని ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి హెచ్చరించారు. త్వరలో నెల్లూరు బారాషహీద్ దర్గాలో జరగనున్న రొట్టెల పండగకు వచ్చే భక్తులు ఏఎస్‌పేటకు అధిక సంఖ్యలో రానున్న నేపథ్యంలో డీఎస్పీ పోలీసు సిబ్బంది, దర్గా ఈఓతో సమావేశమయ్యారు. ముందుగా ఈఓ హుస్సేన్‌తో కలిసి దర్గా చుట్టు పక్కల ప్రాంతాలను పరిశీలించారు. బారికేడ్లు, షామియానాలు ఏర్పాటు, భక్తులకు సౌకర్యాలు కల్పనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గా ఎంతో పవిత్రమైందన్నారు. దర్గా పవిత్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలిపారు. భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకునేందుకు ఈ నెల 28 నుంచి 130 మంది పోలీసు సిబ్బందితో భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట సీఐ రవినాయక్, ఎస్సై నరేష్, వక్ఫ్‌బోర్డు ఈఓ హుస్సేన్, దర్గా సిబ్బంది ఉన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ కోటారెడ్డి

ముమ్మరంగా ఓటర్ల పరిశీలన


ఓటర్ల తనిఖీ ప్రక్రియను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్, ఆర్డీఓలు

ఆత్మకూరు: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇంటింటికి వెళ్లి ఓట్లను పరిశీలించే కార్యక్రమం ఆత్మకూరు పట్టణంలో ముమ్మరంగా సాగుతోంది. అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరి, ఆత్మకూరు ఆర్డీఓ సాధు కరుణకుమారి మున్సిపల్ పరిధిలో జరుగుతున్న ఇంటింటికి ఓటర్ల పరిశీలన ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. మెయిన్ బజారులోని టెంకాయతోపు వద్ద బీఎల్‌ఓల తనిఖీ ప్రక్రియపై ఓటర్లను అడిగి తెలుసుకున్నారు. బీఎల్‌ఓలు మృతుల ఓటర్లను గుర్తించాలని పూర్తిగా ఊరి నుంచి వెళ్లిపోయిన వారి ఓటర్లను గుర్తించాలని సూచించారు. ఎలాంటి అనుమానాలు ఉన్నా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

ఓటర్ల ప్రక్రియ పక్కాగా ఉండాలి

అల్లూరు: ఓటర్ల నమోదు, తొలగింపుల ప్రక్రియ పక్కాగా ఉండాలని బీఎల్‌ఓలకు కావలి ఆర్డీఓ శీనానాయక్ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ సచివాలయ సిబ్బందికి బీఎల్‌ఓల బాధ్యతలు కల్పించడం జరిగిందన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాను తయారు చేయడం, 18 ఏళ్లు నిండిన వారికి కొత్త ఓటు నమోదు చేయడం, మృతుల ఓట్లను తొలగించడం, జాబితాలోని మార్పులు, చేర్పులపై సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీకి అవార్డులపై హర్షం


మేనేజరు శంకర్‌బాబును సన్మానిస్తున్న యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు

ఆత్మకూరు: నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (ఎన్‌డీసీసీబీ)కి నాబార్డు ద్వారా రెండు అవార్డులు రావడంపై ఆ బ్యాంకు సిబ్బంది, అధికారులు హర్షం వ్యక్తం చేశారు. కో-ఆపరేటివ్ బ్యాంకుల ఉద్యోగులు సంఘం (ఏపీసీసీబీఏ) తరఫున బుధవారం ఆత్మకూరు బ్యాంకు చీఫ్ మేనేజరు, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం అవార్డు అందుకున్న నెల్లూరు బ్యాంకు మేనేజరు సి.శంకర్‌బాబును ఘనంగా సత్కరించారు. టెక్నాలజీ అడాప్షన్, బిజినెస్ గ్రోత్‌లో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడంతో ఆ రెండు అవార్డులు దక్కాయన్నారు. జనరల్ మేనేజర్లు సరిత, ఉషారాణి, వైదయాకర్‌రెడ్డి, మధుసూదన్‌రావు, ఎ.రమేష్ బాబు, శ్రీనివాసులురెడ్డి, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్ శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే మత్స్యకారులకు ఆర్థిక ప్రగతి

- ఫిషింగ్ హార్బర్‌లు, పోర్టులతో తీరంలో నూతన ఒరవడి
- రాయితీపై వలలు, పడవలతో పాటు 50 ఏళ్లు దాటిన వారికి పింఛన్లు
- కావలి మండల మత్స్యకార నాయకులు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మత్స్యకార నాయకులు

కావలి: వైఎస్సార్‌సీపీ హయాంలోనే తీరప్రాంత గ్రామాల అభివృద్ధి, మత్స్యకారుల ప్రగతి ప్రారంభమైందని కావలి వైఎస్సార్‌సీపీ మత్స్యకార నాయకులు తెలిపారు. కావలిలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తీరంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు అనవసరమైన ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వానికి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి మత్స్యకారుల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక ఉద్దేశపూర్వకంగానే ఆత్మీయ సమావేశంలో గందరగోళం సృష్టించారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే మత్స్యకారులకు మంచి రోజులు మొదలయ్యాయని తెలిపారు. జువ్వలదిన్నె వద్ద ఫిషింగ్ హార్బర్, రామయపట్నం పోర్టులతో తీరప్రాంత గ్రామాల్లో అభివృద్ధికి ఆస్కారం ఏర్పడిందన్నారు. స్థానిక యవతకు, మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు మెరుగు పడడంతో పాటు తీరప్రాంత గ్రామాలన్నీ శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. మత్స్యకారులకు రాయితీపై వలలు, పడవల పంపిణీ కూడా ఊపందుకుందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 50 ఏళ్లు దాటిన మత్స్యకారులకు ప్రతి నెలా పింఛన్ అందిస్తున్న ఘనత కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వేట నిషేధ సమయంలో అందించే పరిహారం కూడా రూ.10 వేలకు పెంచి క్రమం తప్పకుండా అందించడం వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయంలో వేట నిషేధ సమయంలో పరిహారం పెద్ద ప్రహసనంగా ఉండేదన్నారు. చాలా మంది మత్స్యకారులకు పరిహారం అందే పరిస్థితి కూడా లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం వలంటీర్ల ద్వారా ఇంటింటికి తిరిగి అర్హులను గుర్తించి పరిహారం అందజేస్తుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మత్స్యకార నాయకులు నాగన్నగారి శ్రీనివాసులు, ప్రళయకావేరి శ్రీనివాసులు, పొన్నాడి శూలం, వాయిల తిరుపతి, వెంకటస్వామి, వాయిల రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

వరికుంటపాడు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని కందుకూరు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రియంవద తెలిపారు. ఆమె బుధవారం వరికుంటపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాన్పులు, మందులు, వ్యాక్సిన్ నిల్వ గదులు, వార్డులను పరిశీలించడంతో పాటు, రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ వైద్యశాలలో ఓపీతో పాటు, కాన్పుల సంఖ్యను పెంచాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. వైద్యశాలకు వచ్చే రోగులతో ఆప్యాయతగా వ్యవహరించాలన్నారు. వైద్యశాలల్లోనే క్షయ నిర్ధారణ కోసం గళ్ల పరీక్షలు నిర్వహించాలన్నారు. ఆశ, ఆరోగ్య కార్యకర్తలు కేటాయించిన సర్వేలను సమగ్రంగా నిర్వహించి కచ్చితమైన సమాచారం సేకరించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. వైద్యశాల పరిధిలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నూరు శాతం వ్యాధి నిరోధక టీకాలు వేయాలన్నారు. ఆమె వెంట వైద్యాధికారిణి కరిష్మా, సీహెచ్‌ఓ రాజశేఖరరాజు, పీహెచ్‌ఏ సుశీలమ్మ పర్యవేక్షకుడు అక్బర్‌బాషా, సిబ్బంది రోజా రమణి, వై. శ్రీనివాసులు ఉన్నారు.


రిజిస్టర్లు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రియంవద

మొహర్రం వేడుకలు ప్రారంభం


నాగులబావి పీర్లచావిడిలో కొలువైన పీర్లు

ఉదయగిరి: మతసామరస్యానికి ప్రతీకగా ముస్లింలు జరుపుకునే మొహర్రం (పీర్ల పండగ) వేడుకలు ఉదయగిరిలో బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని నాగులబావి వీధి, గుంతబజారు ప్రాంతాల్లోని పీర్ల చావిడిల్లో పీర్లను ముస్తాబు చేశారు. పీర్ల చావిడిలను విద్యుద్దీపాలంకరణతో అలంకరించారు. ఈ నెల 29 వరకు నిర్వహించనున్నారు. పీర్లను పట్టణంలో ఊరేగిస్తారని తెలిపారు.


ఆత్మకూరు: చావడిలో పీర్ల కొలువు

ఆత్మకూరు: పట్టణంలోని ఎల్‌ఆర్‌పల్లి పీర్లచావిడి వద్ద మొహర్రం వేడుకలను బుధవారం ఘనంగా ప్రారంభించారు. పీర్ల చావిడిని శుద్ధి చేసి యువకులు పీర్లను కొలువు చేశారు. అనంతరం ముజావర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గురు, శుక్రవారాల్లో అగ్నిగుండ ప్రవేశం, పీర్ల గ్రామ ఉత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చావిడిని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.